ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శనివారం 22 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6.24 శనివారం సాయంత్రం

సహరి: 4.44 ఆదివారం ఉదయం

మందుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు

- ఉమ్మడి తూర్పు జిల్లాలో 16 ఔషధ దుకాణాలపై ఔషధ నియంత్రణశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల దాడులు



మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ, విజిలెన్స్ అధికారులు

కాకినాడ క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా ఔషధ నియంత్రణశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు సంయుక్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా శుక్రవారం మందుల దుకాణాలపై దాడులు నిర్వహించాయి. డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.నాగమణి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఎం.స్నేహిత ఆధ్వర్యంలో ఈగల్ టీంతో కలిసి కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం ప్రాంతాల్లోని 16 ఔషధ దుకాణాలపై దాడి చేసినట్లు ఏడీ నాగమణి తెలిపారు. అందులో కొన్ని దుకాణాల్లో నార్కోటిక్(మత్తు) మందులు బిల్లు లేకుండా, అర్హత కలిగిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయాలు జరపడం గమనించిన అధికారులు ఆయా మందుల షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. నార్కోటిక్స్ మందుల అమ్మకం డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం ప్రకారం నేరం అయినందున కఠినమైన చర్యలు తీసుకుంటామని ఏడీ హెచ్చరించారు. ఈ దాడుల ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, ఎవరైనా దుకాణాదారులు నిబంధనలను బేఖాతరు చేస్తే అలాంటివారిపై చర్యలు తప్పవని, చట్టవిరుద్ధంగా ఔషధ విక్రయాలు జరిపితే ఆ షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



కాకినాడలో ఎండకు తాళలేక స్కార్ఫ్, కళ్లజోడుతో వెళ్తున్న మహిళ

'వేడి'ంపులే..

- మార్చిలోనే మాడ్చేస్తున్న ఎండలు
- జిల్లాలో పలు మండలాలపై వడగాడ్పుల ప్రభావం

(ఆంధ్రజ్యోతి, కాకినాడ)

ఎండలు మండిపోతున్నాయి. మార్చి నెలలోనే మాడ్చేస్తున్నాయి. ఉదయం 8గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్నానికి తన 'ఉష్ణ'రూపాన్ని చూపెడుతున్నాడు. ఓ పక్క ఎండ, మరోపక్క ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. రానున్న మూడు నెలల్లో మరింత అధికంగా ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు సంభవించే అవకాశం ఉందంటున్నారు. కాకినాడ జిల్లాలోని పలు మండలాల్లో వడగాడ్పులు వీయవచ్చని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా, కాజులూరు మండలంలో శుక్రవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఉమ్మడి జిల్లాలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. 36 డిగ్రీలపైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఐదారురోజులుగా ఎండలు ముదురుతూ వస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. రాబోయేరోజుల్లో ఇంకెంత తీవ్రంగా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణశాఖ, విపత్తు నిర్వహణశాఖల హెచ్చరికలు కలవరపెడుతున్నాయి. వారంరోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తుండడంతో జనం బయటకు వచ్చేందుకే జంకుతున్నారు. జిల్లాలో గురువారం కాజులూరు, గొల్లప్రోలు, కాకినాడ నగరం, రూరల్, కరప, కోటనందూరు, పిఠాపురం, తునిలో 35 నుంచి 39డిగ్రీలమధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రానున్న మూడు నెలలు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం సూచిస్తోంది. అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకునేందుకు విపత్తు నిర్వహణ సంస్థతో సహా సంబంధితశాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సూచించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం, విద్యార్థుల పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్, ఇతర సదుపాయాలు కల్పించే ఏర్పాటుచేస్తున్నారు.

ఇలా చేస్తే మేలు..

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. ఉదయం పది నుంచి సాయంత్రం 4గంటల మధ్య అవసరమైతే తప్ప బయటకు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. తప్పనిసరిగా బయటకు వస్తే టోపీతోపాటు వీలైనంత వరకు తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరించాలి. ఎండలో తిరిగి వచ్చినప్పుడు నీరు, కొబ్బరి బొండం, నిమ్మరసం, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ గ్లూకోజ్ తాగాలి. ఎండలో బయటకు వెళ్లాక తీవ్రమైన తలనొప్పి, వాంతులు ఇతర ఆరోగ్య సమస్యలు వస్తే వడదెబ్బకు గురైనట్టు భావించాలి.

పంపా.. బెంగ తీరేనప్పా!



- పంపా రిజర్వాయర్‌కు ఇన్నేళ్లకు మంచి రోజులు
- మొత్తం గేట్లన్నీ కొత్తవి బిగించడానికి ప్రభుత్వం నిర్ణయం
- రూ.2.82కోట్లతో ప్రాజెక్టును బలోపేతానికి టెండర్ల ఆహ్వానం
- గతంలో తుఫాను ధాటికి విరిగిపోయిన గేట్లు
- 60ఏళ్లు దాటడంతో మిగిలినవీ తుప్పు
- గత ప్రభుత్వంలో నిధుల్లేక దెబ్బతిన్న గేట్ల మూసివేత
- ఇప్పుడు అన్ని గేట్లు కొత్తవి బిగించడానికి ప్రభుత్వం ఆదేశాలు
- రూ.150కోట్లు ఖర్చయ్యే ఆధునికీకరణ కోసం రైతుల ఎదురుచూపులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పంపా రిజర్వాయరుకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. ప్రభుత్వం చొరవతో త్వరలో ప్రాజెక్టుకు కష్టాలు తీరనున్నాయి. పాడైపోయిన గేట్ల స్థానంలో అన్నీ కొత్తవి అమరనున్నాయి. ఈ ప్రాజెక్టు గేట్లు పూర్తిగా తుప్పు పట్టి ఏళ్లకు ఏళ్లు అయినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అత్యవసరంగా గేట్లకు మరమ్మతులు చేయాలని అధికారులు నిధులు అడిగితే కనీసం ఖాతరు చేయలేదు. దీంతో పంపా రిజర్వాయరుకు వరదనీరు వస్తే దిగువనున్న గ్రామాలు బిక్కుబిక్కుమనాల్సిన పరిస్థితి. అధికారులు ప్రమాదం జరగకుండా కొన్నిగేట్లు శాశ్వతంగా మూసేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పంపా రిజర్వాయరు కష్టాలు తీర్చేలా ఏకంగా రూ.2.82కోట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. వీటితో త్వరలో అయిదు కొత్త గేట్లను అమర్చనున్నారు.

నాడు అలా.. ఇప్పుడిలా..

ప్రత్తిపాడునియోజకవర్గం శంఖవరం మండలంలో విస్తరించిన పంపా రిజర్వాయరును 1964లో నిర్మించారు. 105 అడుగుల నీటి నిల్వ సామర్థ్యంతో కూడిన ప్రాజెక్టుకు దిగువున తుని, శంఖవరం, తొండంగి మండలాల పరిధిలోని 14 గ్రామాల్లో 12వేల ఎకరాలకు దీనిద్వారా సాగు నీరు అందుతుంది. ఎగువన రౌతులపూడితోపాటు ఏజెన్సీ ప్రాంతాలనుంచి రిజర్వాయరులోకి ఏటా వర్షాకాలం సమయంలో భారీగా నీరు వచ్చి చేరుతుంది. గత వైసీపీ ప్రభుత్వం సమయంలో భారీ తుఫానుకు ప్రాజెక్టుకున్న గేట్లలో ఒకటి పూర్తిగా విరిగిపోయింది. నిర్వహణ కొరవడి పూర్తిగా తుప్పుపట్టేసింది. దీంతో దిగువ గ్రామాలకు పెనుముప్పు పొంచి ఉండడంతో అప్పటికప్పుడు అధికారులు ఆ గేటుకు మరమ్మతు చేయడం సాధ్యం కాక గడ్డర్లు అడ్డంపెట్టి పూర్తిగా మూసేశారు. ఆ తర్వాత మిగిలిన గేట్లు పరిశీలించి చూస్తే అవి కూడా పూర్తిగా తుప్పు పట్టిపోయి ఉన్నాయి. ఈనేపథ్యంలో అన్ని గేట్లు బలహీనంగా మారడంతో వీటికి అత్యవసరంగా మరమ్మతు చేయడం, ఆ తర్వాత వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రూ.కోటిన్నర వరకు మంజూరు చేస్తే అత్యవసర పనులు చేస్తామన్నారు. కానీ అప్పటి జగన్ సర్కారు కేవలం రూ.5లక్షలే మంజూరు చేసింది. ఇవి ఏమూలకూ రాకపోవడంతో అధికారులు తూతూమంత్రంగా పనులు కానిచ్చేశారు. ఇటీవల ఏలేరుకు వరదలు వచ్చిన సమయంలో పంపా రిజర్వాయరుకు భారీగా వరద వచ్చింది. ప్రాజెక్టులో గరిష్ఠంగా 50వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వచేసే సామర్థ్యం ఉండగా, అంతకుమించి రావడం, అటు గేట్లు పూర్తిగా తుప్పు పట్టడంతో అధికారులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పంపా రిజర్వాయరు కష్టాలు తీర్చాలని నిర్ణయించింది. పాడైపోయిన అయిదు గేట్లను తీసేసి కొత్తగా అన్నీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇందుకు రూ.2.82కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు తాజాగా ఈ పనులకు టెండర్లు పిలిచారు. ఏప్రిల్ 2 వరకు టెండర్ల దాఖలుకు గడువు విధించారు. ప్రస్తుతం గేట్లు 15అడుగుల ఎత్తు, 40అడుగుల వెడల్పుతో ఉన్నాయి. వీటిస్థానంలో అధునాతన గేట్లను మరింత అదనపు సామర్థ్యంతో అమర్చనున్నారు.

ఆధునికీకరణపై ఆశలెన్నో..

పంపా రిజర్వాయరు ఆధునికీకరణపై రైతులు ఎన్నో ఆశలుపెట్టుకున్నారు. 1964లో రిజర్వాయరు రాతికట్టుతో నిర్మించడంవల్ల పటుత్వం తగ్గింది. దీంతో కాంక్రీట్‌తో నిర్మాణం జరగాల్సిఉంది. 2022లో కేంద్ర జలవనరుల శాఖకు చెందిన డ్యాం సేఫ్టీ అధికారుల బృందం ప్రాజెక్టును పరిశీలించింది. ప్రాజెక్టు ఆయకట్టు సామర్థ్యాన్ని 1.25లక్షల ఎకరాలకు పెంచాలని దిశానిర్దేశం చేసింది. కాలువల సామర్థ్యం పెంచాలని సూచించింది. కానీ ఆ తర్వాత ఆ ప్రతిపాదనలు పక్కకుపోయాయి. రిజర్వాయరులో పూడిక పేరుకుపోయింది. దీన్ని తొలగించి 30ఏళ్లు దాటుతోంది. దీంతో నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఇవన్నీ పట్టాలెక్కించి ప్రాజెక్టును ఆధునికీకరించాలంటే రూ.150కోట్ల వరకు ఖర్చు కానుంది.

పీ4 సర్వే వివరాలు.. గ్రామసభల్లో ప్రదర్శన: డీఆర్వో

కలెక్టరేట్(కాకినాడ), మార్చి21(ఆంధ్రజ్యోతి): పీ 4 సర్వే వివరాలను ఈనెల 24న జిల్లాలో గ్రామ,వార్డు సభల్లో ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్, ప్రజల పార్టిసిపేషన్(పీ-4) విధానం సర్వే నిర్వహించిందన్నారు. ఈనెల 8న ప్రారంభించిన ఈసర్వే ముగిసిందన్నారు. పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా పీ4 సర్వే జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో గ్రామసభల్లో సర్వే నివేదికను ప్రదర్శన జరుగుతుందన్నారు. ప్రజలు తమకు ఉన్న అభ్యంతరాలను తెలియజేయాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

7

జనసేనలో చేరిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు

- తెనాలిలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల సమక్షంలో చేరిక
- కాకినాడ రూరల్ ఎంపీపీ జనసేనకు దక్కే అవకాశం

6



మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీల సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు

నెలాఖరులోగా పల్లెపండుగ ఉపాధి పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి 21(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ ద్వారా ఈ ఉపాధి హామీ పనుల పురోగతిపై శుక్రవారం అమరావతి సచివాలయంనుంచి ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడనుంచి కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఫారంపాండ్స్ పనుల గ్రౌండింగ్ చేయాలన్నారు. జిల్లాలో 196 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణానికిగాను 138 కిలోమీటర్లలో పూర్తయిందన్నారు. 804 మినీ గోకులాలను నిర్మించామని, 2500 ఫారంపాండ్స్‌కుగాను 823 గ్రౌండింగ్ పూర్తి చేశామని తెలిపారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో రవి కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌కుమార్, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఈఈ మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ భారతి పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షకు 27,369మంది హాజరు

కాకినాడ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 142 పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఆంగ్ల పరీక్షకు 27,574 మంది హాజరు కావాల్సి ఉండగా 27,369 మంది విద్యార్థులు హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ మూడుచోట్ల, డీఈవో ఐదుచోట్ల, తనిఖీ దార్లు 40 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓపెన్ స్కూల్ తెలుగు, ఉర్దూ పరీక్షకు మొత్తం 2212మంది హాజరుకావాల్సి ఉండగా 2023 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో చెప్పారు.

రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశం

కాకినాడ,మార్చి 21(ఆంధ్రజ్యోతి): గతంలో సామర్లకోటలో డిప్యూటీ తహసీల్దార్‌గా సివిల్ సప్లయిస్ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వై.విశ్వేశ్వరరావుపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని ఆదేశించింది. ఆయన విధి నిర్వహణలో ఉండగా సామర్లకోటలో పలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని విజిలెన్స్ అధికా రుల నివేదిక మేరకు ఈ విచారణ చేపట్టాలని సూచించింది. విచారణ బాధ్యతను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు అప్పగించారు.

బిల్లులు చెల్లించట్లేదని కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టర్ల ధర్నా

7

మినరల్ వాటరే.. తాగండి పరవాలేదు.. ఇదీ ప్రస్తుతం ఎక్కడికి వెళ్లినా గ్లాసుతో నీళ్లిచ్చి ముందుగా చెప్పే మాట.. చాలామంది దృష్టిలో బయట నుంచి కొని టిన్నులతో తెచ్చుకుంది మినరల్ వాటర్ కింద లెక్క. ఆ నీరు ఎంత వరకూ సురక్షితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. ప్లాంట్ నీళ్లు తెచ్చుకున్నంత మాత్రాన సురక్షితం కాదు సుమా..! ఏదో మినరల్ వాటర్ తాగుతున్నామని పైకి చెప్పుకోవడం తప్ప.. బోరు వాటర్ కంటే అధ్వానమే మరి.. ఒకసారి మీరు మంచినీళ్లు తెచ్చుకునే ప్లాంట్‌కు అని అనుమతులు ఉన్నాయో లేదో చూస్కోండి.. లేదంటే మీ ఆరోగ్యం గోవిందా!?



సుజలమేనా!

నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు

- మినరల్ పేరిట మోసం
- ప్యాకెట్లు.. బాటిళ్లతో సరఫరా
- పుట్టగొడుగుల్లా ప్లాంట్‌లు
- ఉమ్మడి జిల్లాలో 3 వేలు పైనే
- కనీస నిబంధనలూ కరువే
- ఐఎస్ఐ ప్రమాణాలు గాలికి
- జనం ఆరోగ్యంతో జలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మినరల్ వాటర్ అనుకుంటూ లీటరు రూ.20 పెట్టికొంటున్నాం. మినరల్స్ మాట దేవుడెరుగు.. అసలు అవి సురక్షిత తాగునీరేనా? అంటే ఆలోచించాల్సిందే. కలుషిత నీటి వల్ల వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నా యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. దీంతో వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సరైన పర్యవేక్షణ.. నియంత్రణ లేక మామూలు నీటిని నింపేసి నీళ్లలా డబ్బును దోచేస్తున్నారు. ప్యాకెజ్డ్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ రంగం వేల కోట్ల రూపాయల వ్యాపారమైపోయింది. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వాటర్ ప్లాంట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

పుట్టగొడుగుల్లా..

తాగునీరు ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉండాల్సిందే. కానీ వాటర్ ప్లాంట్ల విషయంలో అది అమలుకావడం లేదు. వాటర్ ప్లాంటు పెట్టాలంటే బోరుకు వాల్టా చట్ట ప్రకారం స్థానిక సంస్థలు తదితర అనుమతులు ఉండాలి. నీరు శుద్ధి చేసిన తర్వాత ప్యాకెట్లు, బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయించాలంటే కచ్చితంగా ఐఎస్ఐ ఉండాలి. ప్రభుత్వ అధికారులు వచ్చి ల్యాబ్‌తో సహా ఉన్నాయా లేదా అనేది పూర్తిగా తనిఖీలు చేస్తారు. నమూనాలను మైక్రో బయాలజీ ల్యాబ్‌లకు పంపించి పరిశీలిస్తారు. ఇది తీసుకున్న తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ ఇస్తారు. ఇవి ఉంటేగానీ ప్యాక్ చేసి అమ్మడానికి వీల్లేదు. ఐఎస్ఐ లైసెన్స్‌కి ఏడాదికి రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది వాటర్ ప్లాంట్ల యజమానులు నిబంధనలకు నీళ్లొదిలేశారు. లూజ్ వాటర్ పేరుతో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నాసిరకం వాటర్ ప్యాకెట్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం లూజ్ వాటర్‌కి ఐఎస్ఐ10500 ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలి. వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లప్లాస్టిక్‌లో నాణ్యతా ప్రమాణాలూ పాటించడం లేదు. చాలా ప్యాకెట్లలో నీరు ప్లాస్టిక్ వాసన వస్తుంటుంది. ఐఎస్ఐ కలిగిన బ్రాండెడ్ కంపెనీల లీటరు వాటరు బాటిల్ రూ.12-14 ఉంటే, నాసిరకం రూ.7-8కే దొరుకుతుంది. లాభం ఎక్కువగా వస్తుందనే కక్కుర్తితో నాసిరకం నీటినే అధికశాతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐఎస్ సర్టిఫికెట్ కలిగినవి కేవలం 10 వరకూ ఉంటే, లేనివి 3 వేల పైమాటే. అసలు ఎన్ని వాటర్ ప్లాంట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనే లెక్క యంత్రాంగం వద్ద లేకపోవడం గమనార్హం.

తాగునీటి ప్రమాణాలివే..

తాగునీరు కచ్చితంగా ఐఎస్ఐ ప్రమాణాలకు లోబడి ఉండాల్సిందే.ప్యాకెజ్డ్ తాగునీరు ఐఎస్ఐ 14543 ప్రమాణాలు పాటించాలి. టీడీఎస్ సున్నా నుంచి 500 వరకూ ఉండాలి. మినరల్ వాటర్ ఐఎస్ఐ 13428 ప్రమాణాలతో టీడీఎస్ 150- 500 ఉండాలి. నాచురల్ డ్రింకింగ్ వాటర్ ఐఎస్ఐ10500 ప్రమాణాలు కలిగి టీడీఎస్ 0-2 వేలు వరకూ ఉండొచ్చు. ఏదైనా పీహెచ్ మాత్రం 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండరాదు. టీడీఎస్ అనేది ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. గోదావరి నీటిలో 150 ఉంటే, కృష్ణా నీటిలో 350 వరకూ ఉంటుంది. వర్షం నీటిలో అసలు టీడీఎస్ ఉండదు. అమ్ల గుణం ఉంటుంది. బోరు నీటిలో టీడీఎస్ 10 నుంచి 15 వేల వరకూ ఉంటుంది. రివర్స్ ఓస్మోసిస్ ప్రక్రియ అనేది టీడీఎస్ తగ్గించడానికి చేస్తారు. దీని వల్ల 50% నీరు వృథా కావడంతోపాటు అవసరమైన లవణాలు పోతాయి. దాంతో లవణాలు కలిపి మినరల్ వాటర్‌గా అమ్ముతారు. అల్ట్రా వయొలెట్, అల్ట్రా ఫిల్టరేషన్ ప్రక్రియ ద్వారా బ్యాక్టీరియా మాత్రమే నశిస్తుంది.



నేడు జల దినోత్సవం

తాగునీటి ప్రాముఖ్యత, వినియోగమే ఉద్దేశంగా 1993 నుంచీ మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2030 నాటికి సురక్షిత తాగునీరు, పారిశుధ్య రంగాల్లో సుస్థిర అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యంగా అమలు చేస్తున్నారు. 'హిమానీ నదం సంరక్షణ' థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

మనమే పరీక్షించుకోవచ్చు..?

మనం తాగేనీటిలో మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, ఇనుము, రాగి, జింక్ వంటివి కలిసిపోయి ఉంటాయి. వీటన్నింటినీ కలిపి మొత్తం కలిగి ఉన్న లవణాలు లేదా టోటల్ డిసాల్వుడు సాలిడ్స్ (టీడీఎస్) అంటారు. టీడీఎస్‌తోపాటు పీహెచ్ స్థాయిలను బట్టి ఆ నీళ్లు మనం తాగొచ్చా లేదా అనేది నిర్ధారిస్తారు. టీడీఎస్ ఎక్కువగా ఉన్నా, పీహెచ్ స్థాయి 6 కంటే తక్కువగా 8.5 కంటే ఎక్కువగా ఉంటే రోగాల బారిన పడడం ఖాయం. టీడీఎస్, పీహెచ్ మీటర్లు బయట మార్కెట్లో దొరుకుతాయి. వాటితో మనం తాగేనీరు పరీక్షించవచ్చు.

నీళ్లు తాగితే.. రోగాలే?

నిర్ధారిత ప్రమాణాల ప్రకారం లేని నీటిని తాగితే రోగాల బారిన పడక తప్పదు. తాగునీటిలో బ్యాక్టీరియా, వైరస్‌లు ఉండకూడదు. పీహెచ్ 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండొద్దు. టీడీఎస్ కూడా అత్యధికంగా 2 వేలకు మించరాదు. అలా లేకపోతే అల్సర్లు, ఎసిడిటీ, అజీర్తి, ఉదర సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్, మోకాళ్ల నొప్పులు వంటివి వస్తాయి.



కేసులు.. జరిమానాలు

మిస్ బ్రాండింగ్ అంటే లేబుల్‌పై ప్రచురించిన ప్రకారం ఉండకపోతే రూ.3 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. పీహెచ్ విలువ నిర్ధారించిన దానికంటే తక్కువగా ఉంటే రూ. 5 లక్షల వరకూ జరిమానా వేస్తారు. అన్‌సేఫ్.. అంటే ప్రజల ఆరోగ్యానికి హానికరం అని తేలితే కోర్టులో కేసు వేస్తారు. విచారణలో నేరం రుజువైతే రూ.5 లక్షల వరకూ జరిమానా లేదా 6 నెలల జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

మిద్దెపై బుజ్జి తోట!







ఆలమూరు మండలం జొన్నాడలో మిద్దె తోటల సాగు.. (పైన) పదేళ్ల బోన్సాయ్.. (కింద) సపోటా

గృహిణి బి.మాధవి.. (పైన) వాటర్ బాటిళ్లతో అందంగా..

- మిద్దె సాగులో జొన్నాడ గృహిణి నూతన ఒరవడి
- వ్యర్థాలకు అందమైన రూపు
- మొక్కలపై మమకారమే కారణమంటున్న మాధవి

(ఆలమూరు- ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యకరమైన కూరగాయలు, మధుర ఫలాలను అందించే రకరకాల పండ్ల మొక్కలు, రంగురంగుల పూలమొక్కలు, స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లు... వీటితో మిద్దె తోటలను సృష్టించారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన గృహిణి బి.మాధవి. కొంచెం అభిరుచి, ఇంకొంచెం ఆలోచన, మరికొంచెం ఓపిక ఉంటే చాలు ఇంటిని హరిత నందనవనంలా మార్చేయ వచ్చని నిరూపించారామె. ఇందుకు వ్యర్థాలనే అర్థవంతంగా వాడడం మరో ప్రత్యేకత. ప్రస్తుత కాలంలో పీల్చేగాలి, తాగేనీరు తినే ఆహారం... ఇలా ప్రతీదీ కలుషితమై, రసాయనాలతో నిండిపోయి తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించడానికి ఆమె ఇంటి మేడపైనే సాగుకు శ్రీకారం చుట్టారు.

500 రకాల మొక్కలు

ఇంటి డాబాపై ఉన్న కొద్దిపాటి స్థలంలోనే దాదాపు 500 రకాల మొక్కలను పెంచుతున్నారు. ఈ అందమైన తోటకు మాధవి ముద్దుగా 'మా బుజ్జి తోట' అని నామకరణం చేసుకున్నారు. ఫలాలు అందించే మొక్కలు, పరిమళాలు వెదజల్లే పూలమొక్కలు, ఆరోగ్యాన్ని అందించే ఔషధ మొక్కలు, ఇంట్లో తినడానికి కూరగాయలు, ఆకుకూరలు... ఇలా అనేక రకాలు పెంచుతున్నారామె. ఏదైనా కొత్తగా చేయాలంటే చదువుకున్న వారికి మంచి ఆలోచనలు వస్తాయని అంటుంటారు. అయితే హరిత నందనవనం పెంచుతున్న మాధవి కేవలం ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. మొక్కలపై ఉన్న మమకారంతో పదేళ్ల కిందట ప్రారంభించి నేడు వందల సంఖ్యలో మొక్కలను పెంచి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. భర్త సాయిబాబు ప్రోత్సాహంతో ఇన్ని రకాల మొక్కలను పెంచుతున్నట్టు మాధవి చెప్పారు. తనకు ఏరువాక శాస్త్రవేత్తల గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తంచేశారు.

పనికిరాని వస్తువులతో అద్భుతాలు

ఇంట్లో పనికిరాని వస్తువులను మనం బయట పడేస్తుంటాం. అయితే మాధవి మాత్రం వాటినే పెట్టుబడిగా పెట్టి కొత్త ఆలోచనతో వాటిని అందంగా తయారుచేసి వాటిలో మొక్కల పెంపకం చేస్తున్నారు. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్ బాటిల్స్, వాటర్ టిన్స్, ప్లాస్టిక్ డబ్బాలు, పనికిరాకుండాపోయిన ఫ్రిజ్, గ్రైండర్.. ఇలా అనేక రకాలను మొక్కల పెంపకానికి ఉపయోగిస్తున్నారు.


సేంద్రియ ఎరువుల తయారీ

ఇంట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు, వాడి పాడేసిన టీపొడి, కుళ్లిపోయిన కూరగాయలతోపాటు కూరగాయలు, ఉల్లిపాయలు పైతొక్కలను నిల్వచేసి ఎరువుగా మార్చి వాటిని మొక్కలకు అందిస్తున్నారు. ఇంట్లో నిల్వ ఉండి పాడైపోయిన పిండి పదార్థాలను నీటిలో కలిపి నిల్వ చేయడం ద్వారా వాటిని మొక్కలకు వేస్తే బలంగా పెరుగుతాయన్నారు.

చీడపీడల నివారణ

మొక్కలు అనేటప్పటికి చీడపీడల బెడద ఉంటుంది. పొగాకు కాడలు ఉపయోగించి వాటిని నివారిస్తున్నామని ఆమె చెప్పారు. వేపను కూడా ఉపయోగిస్తున్నామని తెలిపారు.

ఉభయ తారకంగా..
సీలేరు కాంప్లెక్స్



- అటు జలవిద్యుత్ ఉత్పత్తిలోను భేష్
- ఇటు గోదావరిడెల్టాకు నీటివిడుదల
- జలవిద్యుదుత్పత్తిలో నెల రోజుల ముందే లక్ష్యాన్ని అధిగమించిన మూడు విద్యుత్ కేంద్రాలు
- రబీ సీజన్‌లో 10 నుంచి 15 టీఎంసీల వరకు గోదావరి డెల్టాకు నీరు

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలవిద్యుత్ కేంద్రాల్లో మూడు కేంద్రాలు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించిన గడువు కంటే ముందుగానే అధిగమించి రికార్డు నెలకొల్పాయి. కాంప్లెక్స్ పరిధిలో మాచ్‌ఖండ్, ఎగువసీలేరు, డొంకరాయి, పొల్లూరు నాలుగు జలవిద్యుత్ కేంద్రాలు ఉండగా ఒక్క మాచ్‌ఖండ్ మినహా మిగతా మూడు కేంద్రాలు లక్ష్యాలను నెలరోజుల కంటే ముందే పూర్తి చేశాయి.

సీలేరు కాంప్లెక్సులోని 2024-25 సంవత్సరానికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ వారు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి 1084 మిలియన్ యూనిట్లు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రానికి 85 మిలియన్ యూనిట్లు, ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి 477 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం మొదటిగా జనవరిలోనే అంటే రెండు నెలలు ముందేఅధిగమించి రికార్డు నెలకొల్పింది. ఎగువ సీలేరు, పొల్లూరు రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఫిబ్రవరి నెలాఖరు నాటికి టార్గెట్‌నే పూర్తిచేశాయి. నెలరోజులు ముందుగానే టార్గెట్‌లను పూర్తి చేసి రికార్డులను నెలకొల్పాయి. మార్చి 16నాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు జలవిద్యుత్ కేంద్రాల్లో 2305 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు. సీలేరు కాంప్లెక్స్ జలాశయాలు అన్నింటికీ మార్చి 31 నాటికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ నిర్దేశించిన టార్గెట్ 2286 మిలయన్ యూనిట్లు కాగా మార్చి 16నాటికి 2305 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిచేసి 29మిలియన్ యూనిట్లు అధికంగా చేసి రికార్డు నెలకొల్పింది.

రబీకి నీటి విడుదల

సీలేరు కాంప్లెక్స్‌లో రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచడమే కాకుండా గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటిని సరఫరా చేయడంలో కీలకమైన భూమిక పోషిస్తోంది. రబీ సీజన్‌లో గోదావరి డెల్టాలకు సీలేరు నీరే ప్రధానం. ప్రతిఏటా రబీ సీజన్‌లో సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు విడుదల కాగా, రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీ పంటలకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు, జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి నేరుగా 3వేల క్యూసెక్కులు ఒకసారి, మరో 4,300 క్యూసెక్కులనుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు మరోసారి విడుదల చేస్తున్నారు. రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీకి ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయంనుంచి రెండు దఫాలుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు 9టీఎంసీల నీటిని విడుదల చేశామని, నీటి విడుదలను మార్చి 31వరకు పొడిగించామని జెన్‌కో అధికారులు తెలిపారు. సీలేరు కాంప్లెక్సు విద్యుత్‌ఉత్పత్తిలోనే కాకుండా రబీలో గోదావరి డెల్టాకు నీటి విడుదల చేస్తూ బహుళార్థక సాధక ప్రాజెక్టుగా పేరు గాంచింది.

మంచు.. టెండ..



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఉదయంపూట పొలాలపై కురుస్తున్న మంచు



అమలాపురంలో ద్విచక్రవాహనంపై ముసుగుతో యువతి

రోజంతా ఎండ.. రాత్రినుంచి తెల్లవారు జాము వరకు మంచు. ఇది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. జనం ఎండనుంచి రక్షణకు ముసుగులతో ఇలా ప్రయాణాలు చేస్తున్నారు.



కాకినాడలో స్కూటీపై స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న యువతి

వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లే చేస్తే
మనం దేనికోసం పుట్టాం

- ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకరరావు
- ఐడియల్ కళాశాలలో గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియాపై జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకరరావు

కాకినాడ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లేచేస్తే మిగతా జనం దేనికోసం పుట్టినట్లని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకరరావు అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీయల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాల ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలు గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై రెండురోజుల పాటూ నిర్వహించే జాతీయస్థాయి సదస్సును టి.శివశంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలు, అభివృద్ధి విషయంలో ప్రజల భాగస్వామ్యం కీలకమవుతున్నదని సీఎం నారా చంద్రబాబునాయుడు తరచూ చెబుతున్నారని ఇలాంటి సదస్సులు అందుకు తోడ్పడతాయన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా పెట్టుబడిలేనివాళ్లు కూడా సంపద సృష్టించగలరని తెలిపారు. ఈ కార్పొరేషన్ ద్వారా లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ చదివితే ప్రభుత్వమే ఉద్యోగాలిస్తుందనే భావనలో మార్పు వచ్చిందన్నారు. అందుకే ప్రభుత్వ, ఎంఎస్ఎంఈ ఆశయాలను విద్యార్థులకు అందించేందుకు తమ కళాశాల అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్‌వాసు సారథ్యంలో ఈ జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతిథులు డాక్టర్ స్టీవెన్‌రాజు రచించిన గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా పుస్తకాన్ని, సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు, ప్రొఫెసర్ ప్రసాదరావు, బి.శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ డాక్టర్ స్టీవెన్‌రాజు, గవర్నింగ్ బాడీ సభ్యులు జీవీ కృష్ణంరాజు, జీవీకే వర్మ, శివరామకృష్ణ, విభాగాధిపతులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ప్రభాకర్ బాబ్జీ, ప్రసూన, శశిరేఖ, గోపాలకృష్ణ యాదవ్, మౌనిక, రమణ, అర్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గేట్‌లో...గ్రేట్

- జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థి ఘనత
- ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్‌కు జాతీయస్థాయిలో 9వ ర్యాంకు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షలో జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్ ప్రతిభ కనబరచి 967 స్కోర్‌తో జాతీయస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాధ్ తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ర్యాంకు సాధించిన సాయిచరణ్‌ను శుక్రవారం తన ఛాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదివినపుడు విజయాన్ని సులువుగా అందుకోగలరన్నారు. సాయిచరణ్‌ను అభినందించిన వారిలో రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి ఉన్నారు.



సీహెచ్ సాయిచరణ్‌ను అభినందిస్తున్న వీసీ డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్

ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ ప్రయోజనాలపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని సెనేట్ హాల్లో ఎన్ఏబీఎల్ గున్వత్త యాత్రలో భాగంగా నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) సహకారంతో జేఎన్టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, ప్రయోజనాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. డైరెక్టర్, విభాగాధిపతి మాలోతు రమేష్ అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, విశిష్టఅతిథి గా క్యూసీఐ డైరెక్టర్, ఎన్ఏబీఎల్ రీజినల్ హెడ్ శ్రీకాంత్ రామచంద్రయ్య, ఏడీ పి.శ్రీరామ్ పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్శిటీలోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందడం ద్వారా పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం శ్రీ కాంత్ రామచంద్రయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందిన పరిశ్రమలు, ప్రయోగశాలలు 9వేలకుపైగా ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సులో పలు పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.




రిజిస్ట్రార్, డైరెక్టర్, అతిథులతో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు

దుర్గాడ శివాలయంలో అరుణ కిరణ స్పర్శ

- స్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

గొల్లప్రోలురూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మూలవిరాట్‌లపై అరుణ కిరణ స్పర్శతో భక్తులు తన్మయత్వంలో మునిగారు. శుక్రవారం సాయంత్రం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. గర్భాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర స్వామిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. స్వామి, అమ్మవార్లు పసిడి రంగు వెలుగులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తుల ఆధ్వర్యంలో స్మార్త విద్యార్థుల పండిత బృందంతో మహాసౌర పారాయణ చేశారు. భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయణంలో మరొకసారి ఏటా సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.



దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

27 నుంచి దక్షిణ భారత రాష్ట్రాల
వ్యవసాయ ప్రదర్శన

- రైతులను ఉచితంగా తీసుకువెళతాం
- జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త నరసింహారావు

దివాన్‌చెరువు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఈనెల 27 నుంచి 29 వరకూ దక్షిణ భారత వ్యవసాయ ప్రదర్శనను గుంటూరులోని లాంఫామ్‌లో నిర్వహిస్తున్నట్టు ఏరువాక కేంద్రం తూర్పుగోదావరిజిల్లా సమన్వయకర్త చల్లా వెంకట నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం తదితర అంశాల ప్రదర్శన ఉంటుందన్నారు. దీంతోపాటు రైతుల, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దక్షిణ భారత వ్యవసాయ నిపుణులు రైతులతో సంభాషిస్తారని చెప్పారు. ఈ ప్రదర్శనను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనకు రైతులను ఉచితంగా తీసుకువెళతామని చెప్పారు. ఔత్సాహిక రైతులు ఏరువాక కేంద్రం వారిని 90323 46137లో సంప్రదించాలని నరసింహారావు పేర్కొన్నారు.

జనసేన తీర్థం పుచ్చుకున్న ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు

- తెనాలిలో మంత్రి నాదెండ్ల సమక్షంలో చేరిక

సర్పవరం జంక్షన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడరూరల్ మండలం వైసీపీ పార్టీకి ఆరుగురు ఎంపీటీసీలు షాక్ ఇచ్చారు. ఆపార్టీని వీడి జనసేన పార్టీ గూటికి చేరారు. శుక్రవారం తెనాలిలో జనసేనపార్టీ కార్యాలయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో కాకినాడ రూరల్‌కు చెందిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులకు పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలకతీతంగా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి నాదెండ్ల కోరారు. జనసేనపార్టీ సిద్ధాంతాలు, అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నాయకత్వం, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైసీపీని వీడి జనసేనలో చేరినట్లు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. పార్టీ లో చేరిన ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి విరీష ఎంపీటీసీలు వాసంశెట్టి సత్యవతి, కేతా సూర్యచంద్ర, గుత్తుల శ్రీనివాసరావు, గుత్తుల సత్తిబాబు, మామిడాల నాగచక్రంకుపార్టీ కండువాలువేసి మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీ ఆహ్వానించారు.

జనసేన ఖాతాలో ఎంపీపీ

మండలంలో 18 ఎంపీటీసీ సభ్యులు ఉండగా, 15మంది వైసీపీనుంచి ఎంపీటీసీలుగా ఎన్నికకాగా, ముగ్గురు జనసేన నుంచి ఎన్నికయ్యారు. ఎంపీపీ పదవికి కొవ్వాడ ఎంటీపీసీ గోపిశెట్టి పద్మజ, సర్పవరం ఎంపీటీసీ పుల్ల వెంకటలక్ష్మిలు పోటీపడగా, అధిష్టానం గోపిశెట్టి పద్మజ పేరును ఖరారు చేసింది. చెరో రెండున్నర ఏళ్ల ఎంపీపీ పదవి పంచుకునేలా జంటిల్‌మెన్ ఒప్పందం చేసుకున్నారు. ఎనిమిది నెలల కిందట ఎంపీపీ పదవికి గోపిశెట్టి పద్మజ రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంతం నానాజీ ఎంపీపీ పదవి కోసం వ్యూహాత్మకంగా పావులు కదిపారు. వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు జనసేనపార్టీలో చేరారు. దాంతో ఇప్పటివరకు వైసీపీకి ఉన్న 15 ఎంపీటీసీ సభ్యుల్లో 6 గురు జనసేనలో చేరగా 9మందికి పరిమితమైంది. దీంతో వీరి చేరికతో బలం 9కి చేరింది. పండూరుకు చెందిన ఎంపీటీసీ సభ్యులు నందిపాటి వెంకట శ్రీనివాస్ జనసేన పార్టీలో చేరుతున్నారన్న ఊహగానాలు వినిపించడంతో 10మందితో జిల్లాలోనే జనసేన పార్టీకి చెందిన తొలిసారిగా ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోనుందని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికకు హాజరు కాకుండా గైరుహాజరై పరోక్షంగా జనసేనకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యేకు మరో ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

17 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెవెన్యూ విభాగంలో 17మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నోడల్ అధికారి, కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. పదోన్నతి పొందిన వారిలో జేవీవీఎస్ఎస్ విశ్వనాధ్, కె.అశోక్‌బాబ్జి, ఎస్.రాజారవి చంద్రశేఖర్, పి.సతీష్, సీహెచ్ శిరీష, కె.రవికుమార్, ఆర్.నాగూర్ మీరా, డి.శ్రీరవితేజ, జి.కృష్ణకాంత్, ఎం.రవికిరణ్, కె.సాయికుమార్, ఎం.నితిన్‌కుమార్, ఎం.జాకబ్, సీహెచ్‌టీవీవీ సత్యకాంత్, ఎన్.దుర్గవెంకటేష్, టి.లోహిత్ సాయి, కె.మురళీకృష్ణలు ఉన్నారు. ఉత్తర్వులు తీసుకున్న 15 రోజుల్లో కేటాయించిన పోస్టుల్లో చేరాలని ఆదేశించారు.

మే లో అమెరికాకు జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మేలో అమెరికా వెళ్లనున్నారు. దీనికి సంబంధించి 10 నుంచి 17వ తేదీవరకూ మే నెలలో సెలవుకోరగా ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీసీ తన వ్యక్తిగత పనులకోసం అమెరికా వెళ్లనున్నారు. ఆ పీరియడ్‌లో విశాఖపట్నం ఆంధ్రావిశ్వవిద్యాలయం వీసీ జీపీ రాజశేఖర్ జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తారని సమాచారం.

మతసామరస్యానికి ప్రతీక

నిర్మలగిరి పుణ్యక్షేత్రం



నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాత ఆలయం

నేటి నుంచి 25 వరకు ఘనంగా ఉత్సవాలు
క్రైస్తవులతో పాటు తరలిరానున్న హిందువులు

దేవరపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిర్మలగిరి మేరీమేత పుణ్యక్షేత్రం ఎంతో పేరుగాంచింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని ఈ మేరీమేత పుణ్యక్షేత్రం ఉత్సవాలకు ఏటా భారీసంఖ్యలో భక్తులు వస్తుంటారు. గత 40ఏళ్లుగా నిర్మలగిరి ఉత్సవాలు ప్రతీ ఏడాది మార్చి 22 నుంచి 25వరకు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్రంలో శనివారం జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, పుణ్యక్షేత్ర డైరక్టర్ జాన్‌పీటర్ చేశారు.

ఇదీ ఆలయ చరిత్ర...

ఏలూరు పీఠాధిపతి జాన్‌ములగాడ ఏలూరు నుంచి విశాఖపట్నం వెళ్తూ మార్గమధ్యలో గౌరీపట్నం సమీపంలో కారుకు అంతరాయం ఏర్పడటంతో ఆ ప్రాంతంలో పీఠాధిపతికి మేరీమాత సాక్షాత్కరించి తనకు ఆలయం నిర్మించాలని ములగాడకు ఆలోచింపచేశారు. దీంతో గౌరీపట్నం హైవే పక్కన గల కొండ వద్ద ఆలయ నిర్మాణానికి సమయాత్తం మయ్యారు. గౌరీపట్నం ప్రముఖులు గ్రామపెద్దలతో సంప్రదించి భూసేకరణ చేసి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి కొండపైన ఆలయాన్ని, రోడ్డు పక్కన గేటు సమీపంలో మేరీమాత మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రాన్ని క్రైస్తవులతో పాటు హిందువులు కూడా దర్శించుకోవడం విశేషం. క్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ ఆరోన్ దిరిసన బాధ్యతలు చేపట్టి ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో అన్ని హంగులతో ప్రధాన దేవాలయం నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో ఏలూరు పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన పొలిమేర జయరావు ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ రాయప్ప బాధ్యతలు చేపట్టారు. క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా రోడ్లు, కళావేదిక, భక్తులు వెళ్లే మార్గంలో చెట్లు నాటించారు. ఈ ఆలయంలో ముఖ్యంగా తలనీలాలు సమర్పించడం, కొబ్బరి కాయలు కొట్టడం, లడ్డూలు భక్తులు అందజేయడం, కొవ్వొత్తులు వెలిగించడం చేస్తుంటారు. ఇక్కడ నిత్యాన్నదానం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు భక్తులు సౌకర్యార్థం కూలింగ్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో నిర్మల హృదయ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, 200మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు హాజరవుతారని చెప్పారు.


గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం

తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి...

మోటారు సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి


సతీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రాయవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడిద గ్రామానికి చెందిన చొక్కా సతీష్ (35) కాకినాడలో ఒక చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఏడిదలో తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి శుక్రవారం ఉదయం సతీష్ తిరిగి మోటారుసైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా మాచవరం -పసలపూడి ప్రధాన రహదారిలో ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని సతీష్ ఢీ కొనడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో సతీష్ తలకు గాయమై సంఘటనా స్థలంలో మృతిచెందినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ పి.దొరబాబు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణ ప్రారంభం దినోత్సవం


పండితులను సత్కరిస్తున్న ఆలయ ఈవో సుబ్బారావు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆలయం పునఃనిర్మించి 13 ఏళ్ల పూర్తిచేసుకుని 14వ ఏటా అడుగిడిన సందర్భాని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవరులకు అభిషేకం అనంతరం స్వామివారికి లక్ష పత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 2012 ఆలయ శిఖర ప్రతిష్ఠలో పాలుపంచుకున్న ఆరుగురు పండితులకు ఈవో వీర్ల సుబ్బారావు దుశ్శాలువా కప్పి పుష్పమాలాంకృతలను చేసి నగదు పురస్కారంతో సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో ఆకొండి వ్యాసమూర్తి, గొర్తి సుబ్రహ్మణ్య ఘనాపాఠి, గాడేపల్లి సత్యనారాయణ తదితరులున్నారు.

- పండితులు, అర్చకులకు ఘన సత్కారం

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానం కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ రామ్మోహనరావు, పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా అధికారులు స్వామివారి చిత్రపటం, మెమెంటో అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులున్నారు.


సత్యదేవుని దర్శనానంతరం న్యాయమూర్తి

ఎట్టకేలకు ప్రసాద్ స్కీం పనులకు టెండర్లు ఖరారు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు సంబంధించి టెండర్లు ఖరారైనట్టు టూరిజంశాఖ అధికారులు తెలిపారు. సుమారు రూ.25.32 కోట్ల అంచనాలతో రూపొందించిన ఈ పనులకు సుమారు ఏడాది క్రితం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వీటికి టెండర్లు పిలవగా సాంకేతిక కారణాలతో వీటిని నిలుపుదల చేసి రీటెండర్లను పిలిచారు. రూ.25.32 కోట్లతో పిలిచిన టెండర్లను విశాఖపట్నంకు చెందిన ఒక సంస్థ టెండర్ 16శాతం తక్కువకు కోడ్ చేసి టెండర్ దక్కించుకుంది. త్వరలో అగ్రిమెంట్ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో ప్రధానంగా నూతన అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, మరుగుదొడ్లు, 2 ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్‌స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. ఈ పనులకు దేవస్థానానికి ఏ సంబంధం ఉండదు. టూరిజంశాఖ ఆధ్వర్యంలోనే చేపట్టనున్నారు.

రెండు బోర్లకు భూమిపూజ

ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లింపు అంశంపై అసంపూర్తిగా సమావేశం

వేసవిలో భక్తులకు నీటి సమస్యలు ఏర్పడకుండా త్వరితగతిన రూ.10లక్షలతో 2 బోర్లు ఏర్పాటు కు శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు భూమిపూజ నిర్వహించారు. ఈ 2 బోర్ల ద్వారా నీటిని సత్యగిరి కొండపై వాటర్‌ట్యాంక్‌కు చేర్చి హరిహరసదన్, శివసదన్, విష్ణుసదన్, అతిథి గృహాలు, ఉచిత కల్యాణమండపాలకు అందజేయడం జరుగుతుందని ఈవో తెలిపారు. మరోపక్క పంపాజలాశయంలోకి ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లించే విషయమై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ఇరిగేషన్, పోల వరం అధికారులు నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ముగిసింది. పోలవరం పనులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి అందజేస్తామని, దీని నిధులు ఇప్పించాలని పోలవరం అధికారులు కోరారు. సుమారు రూ.40 లక్షలు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- కొత్తపల్లి మండలం కొమరగిరి ఇళ్ల స్థలాల లేఅవుట్ వద్ద నిరసన
- ర్యాలీకి అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు


కొమరగిరిలో పేదలకు స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకులు

కొత్తపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి మెగా ఇళ్ల స్థలాల కాలనీ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. తొలుత ఆనందనగరం నుంచి కొమరగిరి జగనన్న మెగా ఇళ్లకాలనీ వద్దకు వెళ్లడానికి అనుమతి లేదని కొత్తపల్లి పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులతో కలిసి సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై స్థానిక తహశీల్దార్‌ను కలిసి చర్చించేందుకు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాల మంజూరు కోసం కొనుగోలు చేసిన భూమిని వైసీపీ నాయకులు అధికారులతో కుమ్మక్కై పలువురు రైతులకు కౌలుకు ఇచ్చి సాగు చేయడంపై రామకృష్ణ మండిపడ్డారు. నిరుపేదల ఇళ్లస్థలాల కోసం రైతులకు పరిహారం చెల్లించి కొనుగోలు చేసిన భూమిని కచ్చితంగా ప్రభుత్వానికే చెందుతుందన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టి పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని కౌలుకు ఇచ్చేందుకు సహకరించిన అధికారులపై చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ, తాటిపాక మధు, లోడ అప్పలరాజు, తోకల ప్రసాద్, కేశవరపు అప్పలరాజు, ఎ.భవాని, బల్ల సురేష్, కేతా గోవిందు, వి.గురవయ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి


సుబ్బయ్యమ్మ (ఫైల్)

దేవీపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం గ్రామ పంచాయతీ పరిధి పోతవరం గ్రామం ఆదివాసీ కుల శతాధిక వృద్ధురాలు కుంజం సుబ్బయ్యమ్మ(110) శుక్రవారం మృతిచెందారు. మూడు తరాలు చూసిన సుబ్బయ్యమ్మ అంగన్‌వాడీ ఆయాగా ఎంతో మందికి వంట చేసి వడ్డించారు.

ఆరేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు

కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్ల ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్ శాంతారామ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త పనులకు టెండర్లు వేయలేకపోతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించడానికి పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సీఎఫ్ఎంఎస్ నిధి పోర్టల్‌లో సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలన్నారు. ఆర్ అండ్‌బీ విభాగంలో రూ.1350కోట్ల నాబార్డుతో సహా వివిధ ప్రణాళికల కింద నిధుల క్లియరెన్స్ చేయాలన్నారు. అదనంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అప్‌లోడ్ చేయని బిల్లుల మొత్తం రూ.500కోట్లు ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.800కోట్లు ఉన్నాయన్నారు. ఇతర విభాగాల్లో రూ.5వేలకోట్ల బిల్లులు క్లియరెన్స్ చేయాల్సిఉందని శాంతారామ్ తెలిపారు. తొలుత ర్యాలీ కాకినాడ శారదాదేవి గుడి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి కాకినాడ కలెక్టరేట్‌కు చేరింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలకృష్ణ, ప్రకాష్‌రావు, ప్రసాద్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద

సీఆర్పీఎఫ్ విస్తృత తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శుక్రవారం జరిగిన ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ డివిజన్లో రెండు భారీ ఎదురుగాల్పులు ఘటనలో 30మంది మావోయిస్టులు మృతి చెందారు. ఒకజవాను వీర మరణం పొందారు. ఈ నేపథ్యంలో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానుతులను ప్రశ్నించి విడిచిపెట్టారు. మోతుగూడెం నుంచి సుకుమామిడి నుంచి నేలకోట వెళ్లే మార్గంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ బలగాలు దారి పొడవునా తనిఖీలు నిర్వహించారు. ట్రైనింగ్ ఎస్ఐ సీతారాం ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. మోతుగూడెం సుకుమామిడి మార్గాల వైపు నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నేలకోట సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు నిఘా పెట్టాయి. తనిఖీల్లో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధరం ప్రకాష్, సీఆర్పీఎఫ్ ఏ/41 బెటాలియన్ సిబ్బంది, సివిల్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాల తనిఖీ

బాలికపై అత్యాచారం..

50 ఏళ్ల వ్యక్తికి ఐదేళ్ల జైలు

అయినవిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయిన విల్లి మండలంలో ఓ మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు జడ్జి కె.శ్రీదేవి తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. వివరాల ప్రకారం.. 2023 మే 11న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన డెక్క రాంబాబు (50) బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లి గడియ పెట్టాడు. చుట్టుపక్కలవారు చూసి రాంబాబు ఇంటి తలుపులు పగులకొట్టి బాలికను పిలిచారు. బాలికను బయటికి పంపించి అక్కడి నుంచి రాంబాబు పరారయ్యాడు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి ఏడుస్తూ చెప్పగా అదేరోజు అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు అయినవిల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ దర్యాప్తు చేసి రాంబాబును అరెస్టుచేసి పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించారు. కాకినాడ పోక్సో కోర్టులో కేసు ట్రయల్ నిర్వహించారు. పీటీ జి.వెంకటరత్నంబాబు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాలు అనంతరం రాంబాబుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీదేవి నింది తుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. సీఐ రుద్రరాజు భీమరాజు, సిబ్బందిని అభినందించారు.

గ్యాస్ సిలిండర్ లీకై పెంకుటిల్లు దగ్ధం


వడిశలేరులో కాలిపోయిన పెంకుటిల్లు

రంగంపేట,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు చెలరేగడంతో పెంకుటిల్లు దగ్ధమైంది. భార్యాభర్తకు గాయాలయ్యాయి. వీఆర్వో టి.అశ్విని వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులోని బీసీ కాలనీలో గోనబోయిన సత్యనారాయణ, గోనబోయిన శ్రీనుల కుటుంబాలు ఓ పెంకుటింట్లో నివాసముంటున్నాయి. శుక్రవారం ఉదయం 11.30 సమయంలో సత్యనారాయణ భార్య గంగారత్నం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఇంటికి నిప్పంటుకుని 2కుటుంబాలకు చెందిన గృహోపకరణ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సత్యనారాయణ, గంగారత్నం ముఖం, కాళ్లు కాలిపోయాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఘటనలో సుమారు 1,50,000 ఆస్తి నష్టం జరిగినట్టు వీఆర్వో పేర్కొన్నారు. కాగా తక్షణ సాయంగా తహశీల్దార్ కోసు అనసూయ 2 కుటుంబాలకు బియ్యం, పంచదార సమకూర్చి అందజేశారు.

దంపతులకు గాయాలు

మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఈ నెల 19న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని ఏసీఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో 23వ వార్డు చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తుంది. సీతంపేట మండలం కాటవరానికి చెందిన బొద్దు సూర్యనారాయణ అలియాస్ సూరి అనే వ్యక్తి వెనుక నుంచి వచ్చి పద్మకుమారి మెడలోని ఆరున్నర కాసుల రెండుపేటల బంగారపు గొలుసును లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో సూర్యనారాయణను శుక్రవారం దొమ్మేరు అండర్ పాస్ వద్ద అరెస్టు చేసి అతడి వద్ద నుంచి బంగారపు గొలుసును పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు. త్వరగా దొంగతనం కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంతో సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావును జిల్లా ఎస్పీ అభినందించినట్టు డీఎస్పీ చెప్పారు.

ఒక్క చేప రూ.10వేలు

కాకినాడ కుంభాభిషేకం బీచ్ వద్ద శుక్రవారం ఒక మత్స్యకారుడి వలకు 60 కిలోల బరువు గల కొమ్ముకోనం చేప పడింది. ఇది సుమారు రూ.10 వేల వరకు ధర పలుకుతుందని, కేరళకు ఎగుమతి చేస్తామని అతడు చెప్పడం విశేషం.
– ఫొటోగ్రాఫర్, కాకినాడ



చెట్టుపై నుంచి జారి పడి ఆదివాసీ బాలిక మృతి

ఎటపాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివాసీ బాలిక మృతి చెందిన ఘటన శుక్రవారం ఎటపాక మండలం చింతలపాడు వలస ఆదివాసీ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడివి జ్యోతిలక్ష్మీ(12) ఐదురోజుల క్రితం అటవీ ప్రాంతంలోకి తునికి కాయలు (పండ్లు) సేకరణకు వెళ్లింది. చెట్టు ఎక్కి అక్కడ నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా లక్ష్మీపురం పీహెచ్‌సీకి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక శుక్రవారం మృతి చెందింది.

పాటు కాటుకు ఉపాధి కూలీ మృతి

కిర్లంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం పంటకాలువ పూడిక తీత పనిచేస్తున్న ఉపాధి కూలీ నీలాద్రి అప్పారావు(53) పాముకాటుకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని స్థానికులు తెలిపారు.

ఏలూరు రేంజ్‌లో 31 మంది ఏఎస్ఐలకు పదోన్నతి

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్‌లో ఏఎస్ఐలుగా పని చేస్తున్న 31 మందికి ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ఏఆర్ఎస్ఐలకు ఆర్ఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో నలుగురు, కోనసీమ జిల్లాలో 8మందికి, తూర్పుగోదావరి జిల్లా 8మంది, ఏలూరు జిల్లా ముగ్గురికి ఎఎస్ఐల నుంచి ఎస్ఐలుగా, ఎన్టీఆర్ జిల్లాలో ఎఆర్ఐ ఎస్ఐలకుఆర్ఎస్ఐలుగా పదోన్నతికల్పించారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించినవారిపై దాడి

ఇద్దరికి తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించిన వారిపై దాడికి దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్‌కు సమీపంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బైపాస్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఆ మార్గంలో వెళ్తున్న తాటిపర్తికి చెందిన మురాలశెట్టి సూర్యతేజ, పేకేటి ప్రసాద్ వారిని ప్రశ్నించారు. ఇదే సమయంలో ఆ వ్యక్తులకు సంబంధించిన మరికొందరు వచ్చి సూర్యతేజ, ప్రసాద్‌పై దాడికి దిగారు. వారికి తీవ్రగాయాలవ్వగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సఖినేటిపల్లి-నర్సాపురం రేవు పాట

రూ.4,18,18,959కు టెండరు ఖరారు

అంతర్వేది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి-నర్సాపురం మాధవాయపాలెం ఫెర్రీ సంవత్సరానికి టోల్ వసూలు హక్కులు పొందేందుకు శుక్రవారం బహిరంగ టెండరు వేలం నర్సాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. హెచ్చు పాటదారుడైన శ్రీవిఘ్నేశ్వర కోఆపరేటివ్ బోట్స్ సొసైటీ టేకిశెట్టివారిపాలెం పేరున రూ.4,18,18,959కు వేలం ఖరారైందని సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లికార్జునరావు, ఎంపీడీవో ఇన్‌చార్జి ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నర్సాపురం మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

రేపు కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీ డీవో రవి కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 కు జరిగే సమావేశానికి ఎంపీపీ కారే సుధ అధ్యక్షవహిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలన్నారు. మండలస్థాయి అధికారులు గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

‘ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం అభినందనీయం’


కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. సురేష్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి కాకినాడజిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజుమాదిగ అధ్యక్షత వహించారు. ముందుగా ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసిన ందుకు హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కటింగ్, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు నాగరాజు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాదిగ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 59 ఉపకులాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం 15శాతం రిజర్వేషన్‌ను న్యాయ బద్ధంగా కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఎస్సీ ఎ గ్రూప్ రెల్లి, ఉపకులాల ప్రజలకు 1శాతం, బి గ్రూప్ మాదిగ, ఉపకులాలకు, 6.5 శాతం, సి గ్రూప్ మాల, ఉపకులాలకు 7.5శాతంగా పంచామన్నారు. ఈ విధానం అంబేడ్కర్ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని విద్య, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో అమలు చేయడం హర్షణీయమన్నారు. వర్గీకరణ అమలు అయ్యేంత వరకు అన్ని విభాగాల్లో ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేయడంపట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు కృతజ్ఞతలు తెలి పారు. క్యాబినెట్ తీర్మానం, అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానానికి తోడ్పడిన మాల, మాదిగ మంత్రు లు, ఎమ్మెల్యేలు అభినందనీయులన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరేల్లి ఎలీషా, రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా అధ్యక్షుడు అనంతారపు రాజు, ఉమ్మడి జిల్లాల కన్వీనర్ ముప్పిడి శ్యామ్‌కుమా ర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్, కోనసీమజిల్లా అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఎంఎస్‌పీ ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు, జిల్లా అధ్యక్షు డు వల్లూరి సత్తిబాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్, జిల్లా ప్రచార కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ కాకినాడ అచ్యుతాపురం లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హౌస్‌అరెస్టుల ద్వారా రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరించడం తగదన్నారు. వర్గీకరణ పేరుతో మాలలకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు సుబ్రహ్మణ్యం, సతీష్ కుమార్, లోవరాజు, సూర్యచంద్ర, అమ్మాజీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగరాలి’

గొల్లప్రోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగరాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శక్తి కేంద్ర, బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 6న నాయకులు, కార్యకర్తలు అందరూ తమ ఇళ్లపై జెండా ఎగురవేయాలన్నారు. బూత్, శక్తి కేంద్ర కమిటీల ఏర్పాటును పూర్తి చేయాలని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, మ లిరెడ్డి నారాయణరావు, తోట ఏడుకొండలు, రవణం సుబ్రహ్మణ్యం, దోనే అచ్యుతరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులుగా చీపూరి భాస్కరరావు, ఆదుమళ్ల కల్యాణ్, కోశాధికారిగా పెద్దిశెట్టి మహేష్, ఉపాధ్యక్షులుగా దొడ్డిపట్ల జితేంద్ర, కోశెట్టి అడవిరాజు, మేడసాని కామరాజు, పెద్దిశెట్టి సత్యనారాయణ, నరాలశెట్టి మంగాదేవి, కాకి వరలక్ష్మి, కార్యదర్శులుగా వియ్యపు రాములు, తంగెళ్ల బాబూరావు, షేక్ రహ్మాన్, పడాల ప్రసన్న, సంతోషి, మలిరెడ్డి అమ్మాజీ, ముడదా మార్తమ్మలు నియమితులయ్యారు. వీరిని జిల్లా అధ్యక్షుడు అభినందించారు.

మహిళా సంఘాల ఉత్పత్తులకు అవార్డు పురస్కారం


సామర్లకోట మెప్మా సిబ్బందిని అభినందిస్తున్న దృశ్యం

సామర్లకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మహిళాసంఘాల ఉత్పత్తుల విక్రయాలలో సరికొత్త రికార్డు సృష్టించిన కారణంగా అభినందిస్తూ వావ్‌జెని ఆన్‌లైన్ యాప్ సంస్థ ప్రత్యేక అవార్డు అందించడంతో జిల్లా మెప్మా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మెప్మా సిబ్బందితో కలిసి అభినందన సభ నిర్వహించారు. జిల్లా మెప్మా ప్రాజెక్ట్ తరపున పీడీ ప్రియంవద అమరావతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు, ప్రశంసాపత్రాలు అందుకున్నారని సామర్లకోట మెప్మా సీఎంఎం హుస్సేన్ చెప్పారు. కార్యక్రమంలో సామర్లకోట మెప్మా కార్యాలయ సిబ్బంది, సీఆర్‌పీలు, మహిళాశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తప్పుడు ఆహార అలవాట్లతోనే నోటి అనారోగ్యాలు


అవగాహన ఏర్పరుస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అమల

సామర్లకోట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఆహారపు అలవాట్లు కారణంగానే నోటికి అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, దీనిని నిరోధించేందుకు ప్రతీఒక్కరూ తమ పళ్ళ ను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవాలని సామర్లకోట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వైద్యాధికారిణి డాక్టర్ అమల పేర్కొన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్యదినోత్సవ వేడుకలు శుక్రవారం సీహెచ్‌సీ ఆవరణలో దంతవైద్యురాలు డాక్టర్ ప్రవీణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అమల మాట్లాడుతూ ఆరోగ్యకరమైన చిరునవ్వును కాపాడుకోవాలని వరల్డ్ ఓరల్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దంత వైద్యనిపుణురాలు డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ సరైన ఆహారం తినడం తోపాటు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా మీరు, మీ దంతాలను బలంగా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చన్నారు. అంతకుముందు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వరలక్ష్మి, సంతోషిలక్ష్మి, రాకేష్, రమేష్, కార్తీక్, హెడ్‌నర్స్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యమే నవోదం-2

వాకలపూడిలో నవోదం-2 అవగాహన సభ


మాట్లాడుతున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రేణుక

సర్పవరంజంక్షన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నిరుపేదల జీవితాల్లో చిమ్మచీకట్లను నింపుతున్న సారా రక్కసిని ఉక్కు పాదంతో అణచివేసి, సారారహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవోదం-2 కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక, సూపరింటెండెంట్ ఎం.కృష్ణకుమారిలు తెలిపారు. శుక్రవారం వాకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి పిడుగు పాండురంగారావు ఆధ్వర్యంలో నవోదం-2.0పై పారిశుధ్య కార్మికులు, గ్రామస్థులపై అవగాహ న గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటుసారాతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన సొమ్మంతా సారాకు ధారపోయడంతో అనారోగ్యాలబారిన పడుతున్నారన్నారు. నాటుసారా నిర్మూలన కోసం, సారా తయారుచేసే వాళ్లలో మార్పు తీసుకువచ్చి, వారి జీవనోపాధి కోసం నవోదయం-2 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నాటుసారా తయారుచేసినా, అమ్మినా నేరమేనన్నారు. నాటుసారా రహిత గ్రామంగా వాకలపూడిని తీర్చిదిద్దేందుకు స్థానికులు, అధికారులు సహకరించాలని కోరారు. ఎక్కడైనా నాటుసారా తయారుచేసినా, అమ్మకాలు జరిగినట్లు సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా నాటుసారా తయారీ, తాగడంవలన కలిగే అనర్థాలు, అనారోగ్య రుగ్మతలపై అవగాహన కల్పించారు. ముందుగా కళాకారులతో అవగాహన కళాజాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ ప్రత్యేకాధికారి, ఈవోపీఆర్‌డీ ఎం ఎస్ఆర్ ఆంజనేయులు, ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ సీఐ కె.రామ్మోహన్, ఎస్ఐ బీఎస్ఎస్ వరహాలు, గంటాప్రసాద్, గేదెల చిన్నారావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

‘పోషక విలువలతో ఆహారం తీసుకోవాలి’


మాట్లాడుతున్న సీడీపీవో దుర్గాదేవి

గొల్లప్రోలు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన బలవర్థకమైన ఆహారం తీసుకునేలా చూడాలని ఐసీడీఎస్ పిఠాపురం ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ తరగతుల రెండోరోజు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పోషణ అంశంపై శిక్షణ ఇచ్చారు. పోషణ్ బీ, పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాలలోపు చిన్నారులకు ఎదుగుదలకు నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులకు అభివృద్ధికి ఆదర్శిల కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మానసాదేవి, మణి, నాగమణి, దేవకుమారి పాల్గొన్నారు.

వాకతిప్పలో పోషన్‌బీ పడాయి శిక్షణ

కొత్తపల్లి : వాకతిప్ప జిల్లా జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యం లో శుక్రవారం పోషన్ పడాయిబీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కె.కనకదుర్గాదేవి మూడు సంవత్సరాల పిల్లల పర్యవేక్షణ, ఎటువంటి ఆహారం పెట్టాలనే విషయంపై పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, సారమ్మ, శ్రీదేవి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరల్డ్ డౌన్ సిండ్రోం డే

పెద్దాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో భవిత కేంద్రంలో శుక్రవారం వరల్డ్ డౌన్ సిండ్రోం డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివజ్యోతి హాజరయ్యారు. ఈసందర్భంగా డౌన్ సిండ్రోమ్ ఉన్నటువంటి పిల్లల చేత కేక్‌కట్ చేయించి పిల్లలకు తినిపించారు. జన్యుపరమైన క్రోమోజోమ్స్ వల్ల వచ్చే ఈ సమస్య గురించి వివరించారు. డౌన్ సిండ్రోమ్ పట్ల అవగాహన కలిగి ఉండి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

కవిత్వంతో సమాజంలో మార్పు

సర్పవరంజంక్షన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కవిత్వంతో సమాజంలో మార్పు తీసుకురావచ్చని ప్రముఖ కవి డాక్టర్ శిరీష తెలిపారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రపంచ కవిత్వ దినోత్సవం పురస్కరించుకుని శిరీషను ఘనంగా సత్కరించారు. సమాజంలో పలు రుగ్మతలను పారద్రోలేందుకు జనాన్ని జాగృతం చేసేందుకు కవిత్వం ఓ ఆయుధమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, రవిశంకర్ పట్నాయక్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

22 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సర్పవరంజంక్షన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వలసపాకలలో శుక్రవారం 22 మంది లబ్ధిదారులకు రూ.18లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆపరేషన్లు, వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం వారి మెడికల్ బిల్లులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రీఎంబర్స్‌మెంట్ చేస్తుందన్నారు.

నూకాలమ్మ అమ్మవారికి సారె సమర్పణ

కాకినాడ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పెద్దమార్కెట్ ఏరియాలో ఉన్న ప్రసిద్ధ శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తభజన బృందం సభ్యులు ప్రతిరోజు అమ్మవారికి శ్రీలలిత సహస్ర నామ పారాయణ నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా భజన బృందం సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, నూతనవస్త్రాలు, పండ్లు, స్వీట్లు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో మురళి వీరభద్రరావు, నాయకులు అయినాల వెంకటరమణ, అమలకంటి బలరామ్, చింతలపూడి రవి, రెడ్నం సత్తిబాబు, కోడూరి పెద్ద పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఎమ్మెల్సీ పద్మశ్రీకి విన్నర్ ట్రోఫీ అందజేత


సీఎం చంద్రబాబు చేతులమీదుగా విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

కాకినాడ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్-2025 క్యారమ్స్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీకి రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ట్రోఫీ అందజేశారు. విజయవాడలోని ఏ వన్ కన్వెన్షన్‌లో గురువారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ము ఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ విజేతలకు మెమెంటోలు అందజేశారు. టెన్నికాయిట్ డబుల్స్ విభాగంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే అఖిలప్రియ విన్నర్‌గా నిలిచారు.

చర్చి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కూరాడలో రిలే దీక్ష

కరప, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కూరాడలో అక్రమంగా చర్చి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పలువురు గ్రామస్తులు శుక్రవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. హైందవ సైన్యం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటరాజు(నాని) గ్రామస్తుల దీక్షకు మద్దతుగా నిలిచి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో అక్రమ చర్చి నిర్మాణాన్ని చేపడితే ఆందోళనలతో అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు అధికారపార్టీ నాయకుల అండతో పాస్టర్ చర్చి నిర్మాణాన్ని ప్రారంభించారని ఆయన ఆరోపించారు. దీన్ని నిరసిస్తూ గ్రామస్తులు దీక్ష చేపట్టారని, అధికారులు స్పందించి చర్చి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని లేకపోతే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. హైందవ సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు పెనుగొండ దుర్గాప్రసాద్ శనివారం శిబిరానికి విచ్చేసి ఆందోళనకారులతో కలిసి దీక్షలో పాల్గొంటారని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

24న పీ 4 సర్వే వివరాలు గ్రామసభల్లో ప్రదర్శన

కలెక్టరేట్(కాకినాడ),మార్చి 21(ఆంధ్రజ్యోతి): పీ 4 సర్వే వివరాలను ఈనెల 24వ తేదీన జిల్లాలో గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్, ప్రైవే ట్ ప్రజల పార్టిసిపేషన్ (పీ-4) విధానం సర్వే నిర్వహించిందన్నారు. ఈనెల 8న ప్రారంభించిన ఈసర్వే ముగిసింద న్నారు. పేదరికం లేని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా పీ 4 సర్వే జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో గ్రామ సభల్లో సర్వే నివేదికను ప్రదర్శిస్తామన్నారు. ప్రజలు తమకు ఉన్న అభ్యంతరాలను తెలియజేయాలన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

పిఠాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకుంటున్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కొత్తపల్లి మండలం అమరవిల్లిలో ఉన్న పాఠశాలను ఇతర పాఠశాలల్లో విలీనం చేయవద్దని కోరుతూ అమరవిల్లి గ్రామస్తులు శుక్రవారం పిఠాపురం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

అన్న క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక 40వ వార్డు వద్ద వివేకానంద పార్కు ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను శుక్రవారం కమిషనర్ భావన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహారం అందించే వేళలు, సదుపాయాలు, ఆహారపదార్థాల నాణ్యతపై క్యాంటీన్ వద్ద ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆహారనాణ్యతపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

300 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ

కాకినాడసిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ 29వ డివిజన్‌లోని బంగారు చినశోభనాద్రి సత్రం 101వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా టీడీపీ జిల్లా ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ 300 మంది పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం సత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీహెచ్ విజయ్ భాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మోహన వర్మ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భారీ అన్న దానం చేశారు.

పెదపూడి మండలంలో రూ. 4 కోట్లతో అభివృద్ధి పనులు

కాకినాడసిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికిగాను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రూ. 4 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో 44 అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘ఆదరణ పథకంలో కుమ్మర్లను ఆదుకోవాలి’

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదరణ 3 అవగాహన సదస్సు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఏఈవో సుబ్రహ్మణ్యం ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో జరిగింది. ఈసమావేశంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ దాలిపర్తి వేమన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో కుమ్మర కులవృత్తి చేసేందుకు కనీసం 10 సెంట్లు భూమి అవసరం అవుతుందన్నారు. కానీ నివాసం ఉండడానికి సెంటు భూమిలేని కుమ్మర కులస్తుల కు కుల వృత్తి చేయడం చాలా భారంగా మారిందన్నా రు. గృహ నిర్మాణం, ప్లంబింగ్, వైరింగ్, టైలరింగ్ వంటి వివిధ పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారన్నారు. కుమ్మర్లకు కులవృత్తికి సంబంధించిన పరికరాలతో పాటు వారు చేస్తున్న ప్రత్యామ్నాయ పనులకు సంబంధించిన పరికరాలను ఆదరణ పథకం ద్వారా కుమ్మర సామాజికవర్గం వారికి ఇచ్చిఆదుకోవాల న్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కరప: కులవృత్తి చేసుకునేవారికి ప్రభుత్వం ఆదరణ పథకం ద్వారా అందజేసే పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం విశ్వ, నాయీబ్రాహ్మణ, రజక, కుమ్మరి సంఘాల నాయకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడి వారికి అవసరమైన పరికరాల వివరాలను తెలపాలని కోరారు. బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు చేసుకోవడానికి 22వ తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించారని, కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా గడువు పెంచాలని ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు ఎంపీడీవోకు విజ్ఞప్తిచేశారు. జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, కార్యాలయ సిబ్బంది కార్తీక్ పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకే ఆదరణ పథకం

పెద్దాపురం: వెనుకబడిన తరగతుల ప్రజల అభ్యున్నతి, సర్వతోముఖాభివృద్ధి కోసం ఆదరణ 3 పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఆదరణ పథకం అమలులో భాగంగా వివిధ రకాల వృత్తి కళాకారుల ప్రతినిధులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వృత్తి కళాకారుల నైపుణ్యత, ఆర్థిక స్వావలంబన పెంపొందించేందుకు ఆధునిక పనిముట్లు, సాంకేతికత, మార్కెటింగ్ తదితర సహాయ సహకారాలు అందించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యు.జ్యోతిరాణి, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


కరప స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్

ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

కరప, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఏఎస్పీ మనీష్ దేవరాజ్ శుక్రవారంరాత్రి కరప పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు జారీచేశారు. కేసుల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలని సూచించారు. ఎస్ఐ తోట సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఈటీసీ క్యాంటీన్ వ్యవహారంపై విచారణకు ఆదేశించాం: ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట, మార్చి 21(ఆంధ్రజ్యోతి):సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో శిక్షణార్థులకోసం నిర్వహిస్తున్న క్యాంటీన్ గత దశాబ్ది కాలంగా చోటుచేసుకున్న అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ నిర్వహించి టెండర్ ప్రక్రియద్వారా క్యాంటీన్ నిర్వహించాలని తాను ఏపీఎస్ఆర్‌డీ అధికారులకు ఫిర్యాదు చేశానని ప్రభుత్వం త్వరలోనే విచారణ చేస్తుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఈమేరకు విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు కులసంఘాలను అడ్డుపెట్టుకుని అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి అక్రమంగా క్యాంటీన్ నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే చినరాజప్ప ఆరోపించారు. ఇదంతా పరిపాలనా వ్యవహారంలో భాగంగా ఇటీవల టెండర్ల ప్రక్రియ వాయిదా వేశారన్నారు. టెండర్ల ప్రక్రియలో తనకెంత మాత్రం సంబంధం లేకపోయినా కొందరు వ్యక్తులు బురదచల్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమాలకు, బెదిరింపు చర్యలకు పాల్పడిన వ్యక్తులు ఎప్పటికైనా చట్టానికి పట్టుబడక తప్పదని ఎమ్మెల్యే చినరాజప్ప హెచ్చరించారు.

పీ4 పాలసీ గ్రామసభలు నిర్వహించాలి

పెద్దాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో డి.శ్రీలలిత పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పీ4 పాలసీ గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు, వేసవి చలివేంద్రాల ఏర్పాటు, 22న వరల్డ్‌వాటర్ డే కార్యక్రమం నిర్వహణ, ఎంఎస్ఎంఈ ద్వారా వ్యాపారులకు సబ్సిడీ రుణాలు అందజేయడం వంటి వాటిపై చర్చించారు.

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

పిఠాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో టీమ్ లీజ్, పేటీఎం, ఎల్ఐసీ, గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఎంపికలు జరిపారు. 147 మంది ఈ జాబ్‌మేళాకు హాజరు కాగా 52మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్యామ్ కిషోర్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రేవతి, ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు పాల్గొన్నారు.

ఏడీఎఫ్‌వోకు ఉగాది పురస్కారం


ఏడీఎఫ్‌వో సుబ్బారావు, కాకినాడ ఫైర్‌స్టేషన్

కాకినాడ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, సాలిపేట, జిల్లా అగ్నిమాపక సహాయాధికారి (ఏడీఎఫ్ఓ) వి. సుబ్బారావు అందించిన విశిష్ట సేవలకుగాను ఆయనను ఉగాది పురస్కారమైన సేవాపథకం వరించింది. 2007లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా ఎంపికై న ఆయన విధి నిర్వహణలో చూపిన అంకిత భావానికి అప్పటి కలెక్టర్ గోపాలకృష్ణ ద్వివేది చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం విధి నిర్వహణలో ఆయన సామర్థ్యాన్ని గుర్తించి 2011లో అప్పటి కలెక్టర్ ముద్దాడ రవిచంద్ర చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే తిత్లీ, హుద్‌హుద్ విలయ తాండవం చేసిన తుపానుల్లో సుబ్బారావ్ ఆయన సిబ్బంది కలిసి చేసిన సేవలకుగాను ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆయనను ఉగాది 2025 సేవా పథకం పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పురస్కారాన్ని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సు బ్బారావ్ అందుకోనున్నారు.

శ్రీనివాసరావుకు డాక్టరేట్

తొండంగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తొండంగికి చెందిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ పరిశోధక విద్యార్థి దూలం శ్రీనివాసరావుకు డాక్టరేట్ లభించింది. ఆంగ్ల విభాగ ఆచార్యులు పి.రాజేంద్ర కర్మార్కర్ పర్యవేక్షణలో జరిగిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది. ఏయు వైస్‌ఛాన్సలర్ పి.రాజశేఖర్ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

యువత క్రీడల్లో రాణించాలి: డీఎస్పీ


వాలీబాల్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్

వై.రామవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యువత క్రీడా పోటీల్లో రాణించాలని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ అన్నారు. శుక్రవారం మండల సరిహద్దులో ఉన్న కొయ్యూరు మండలం పలకజీడి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ టోర్నమెంట్, గ్రామంలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారు. అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో యువతకు సహాయ, సహకారాలు పోలీసుశాఖ అందిస్తుందని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, సారా విక్రయాలు, సైబర్ క్రైమ్‌లు, ఇతర చట్ట వ్యతిరేక కార్యక్రమాల వైపు దృష్టి సారించవద్దని సూచించారు. అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా కొయ్యూరు మండలం తాళ్ల ఎర్రగొండ జట్టుకు రూ.8వేలు, రెండో బహుమతి వై.రామవరం మండలం కోట జట్టుకు రూ.5వేలు, మూడో బహుమతి వై.రామవరం ములసలపాలెం జట్టుకు రూ.3వేలు అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. 800మందికి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెం ట్ కమాండెంట్ రాధ, కొయ్యూరు సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ శంకర్, ట్రైనింగ్ ఎస్ఐలు సురేష్, చక్రధర్, సత్యం, మహదీప్, గౌరీశ్వరి, చందన, లోకేశ్వరి, డాక్టర్ హేమంత్‌చౌదరి, రేణుక, యు.చీడిపాలెం సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి


టోర్నీని ప్రారంభిస్తున్న వల్లభనేని చందు

ఎటపాక, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాల బారిన పడకుండా క్రీడల్లో రాణించాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు ఆకాంక్షించారు. ఎటపాక మండలం తోటపల్లి సమీపంలో అయ్యవారిపేట గ్రామంలో మండల స్థాయి ఎన్టీఆర్ క్రికెట్ మెగా టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. యువత క్రీడల్లో పాల్గొంటూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేకమైన స్పోర్ట్స్ పాలసీని చందు వివరించారు. క్రీడల్లో రాణిస్తే ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. విన్నర్, రన్నర్ జట్లకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పూరేటి వెంకటేశ్వరరావు, దుద్దు కూరి సతీష్, కాంతారావు, కిరణ్ పాల్గొన్నారు.

హైవే బాధితులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 516-ఇ రోడ్డు పనుల్లో భాగంగా భూములు, కట్టడాలు కోల్పోయిన బాధితులకు అవార్డుల ప్రకారం ఎంపిక చేసిన వారికి నష్టపరిహారం చెల్లిస్తామని సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ అన్నారు. శుక్రవారం ఆమె తన కార్యాలయం చాంబరులో మాట్లాడుతూ రాజవొమ్మంగి, రంప చోడవరం మండలాలకు ఆయా తహశీల్దార్ల నివేదికల ప్రకారం ఈనెల22న సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. జాబితాలో ఉన్న లబ్ధిదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. రోడ్డు విస్తరణలో నష్టం లేకుండా నిబంధనల ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామన్నారు.

రాజవొమ్మంగి కార్యదర్శిగా సంధ్యారాణి



రాజవొమ్మంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి పంచాయతీ కార్యదర్శిగా కాకర సంధ్యారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కార్యదర్శి పనిచేసిన కె.శ్రీనివాసరావు పిఠాపురం మండలం దుర్గాడకు బదిలీపై వెళ్లారు. ఏలేశ్వరం మండలం యర్రవరం పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా నన్నారు. అనంతరం కార్యదర్శి సంధ్యారాణికి సర్పంచ్ గొల్లపూడి రమణి, టీడీపీ మండలాధ్యక్షుడు పెద్దిరాజు అభినందనలు తెలిపారు.

దుర్చర్తిలో శాంతి హోమం



అడ్డతీగల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లోతట్టు దుర్చర్తి గ్రామం నూకాలమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మాణానికి సంబంధించి వేటమామిడి ఆలయ ధర్మకర్త, ఆలయ పురోహితులు రాజారెడ్డి ఆధ్వర్యంలో శాంతి హోమం, గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. భక్తుల ఆర్థిక సహాయం, స్థానిక యూత్ కార్యాచరణతో నూకాలమ్మ ఆలయం నూతన వెలుగులు సంతరించుకోనుంది. అడ్డతీగల మండలంలో ఏకైక పురాతన ఆలయం నూకాలమ్మ ఆలయం. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా భక్తుల విశ్వాసం. హోమాలు నిర్వహించిన అనంతరం అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసరావు, చంద్రమోహన్, పువారాగం, నాగరత్నం, సురేష్ తెలిపారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

టీడీపీ మండలాధ్యక్షుడు పెద్దరాజు

రాజవొమ్మంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజన యువత పెడదోవ పట్టకుండా క్రీడలపై దృష్టి సారించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దరాజు అన్నారు. స్థానిక కమ్మరిపేటకు చెందిన గిరిజన యువతకు శుక్రవారం పెద్దరాజు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత ఎటువంటి చెడు వ్యసనాలు అలవర్చుకోకుండా బాగా చదువుకుని ఖాళీ సమయాల్లో క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల ద్వారా మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు చిన్న, అప్పు, రవి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

రాజవొమ్మంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అమీనాబాద్ పంచాయతీ ఏబీ కాలనీ గ్రామంలో శుక్రవారం వైసీపీ కార్యదర్శి జి.శేషగిరిరావు ఆధ్వర్యంలో వైజాగ్ మెడికవర్, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, సర్పంచ్ కించుకు వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈశిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జుర్ర రాజేశ్వరి, జుర్ర జాను, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, అమీనాబాద్ సర్పంచ్, ఉపసర్పంచ్ చేదులూరి రాజబాబు, చేదులూరి అంజిబాబు, పోసిన అప్పారావు, రమేష్, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, రాజు, కొసరాజు, కనిగిరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోషణపై శిక్షణ

రాజవొమ్మంగి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం పోషణ బీ పడాయీ బీ కార్యక్రమం నిర్వహించారు. ఈశిక్షణ 22వ తేదీతో ముగుస్తుందని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ఈసీసీఈ, గ్రోత్ మానటరింగ్, ఆధార్ షిలా నవచేతన వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.అరుణలత, ఎస్.నాగజయలక్ష్మి, బి.అమ్మిరాజు, ఎస్.అమ్మాజీ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రోడ్డు తవ్వేసి... బూడిద పోసి!

భూపాలపట్నం-వీరవరం రహదారి పనుల్లో నాణ్యతా లోపం


నాణ్యత లోపంతో నిర్మిస్తున్న భూపాలపట్నం-వీరవరం రహదారి

కిర్లంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం గ్రామం నుంచి వీరవరం గ్రామానికి వెళ్లే రహదారి పనులు నాణ్యత లోపంతో నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రోడ్లు అభివృద్ధి చేస్తుండగా ఇక్కడ రహదారి పనుల్లో నాణ్యత లోపించి నత్తనడకగా పనులు చేయడం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపట్నం-వీరవరం రహదారి నిర్మాణానికి రూ.75లక్షలు పంచాయతీరాజ్‌శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ రోడ్డును జేసీబీతో తిరగేసి పనులు చేపట్టి నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో సాగడంలేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. దీంతో ఈ రోడ్డు పై వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డు తవ్వేసి బూడిద పోసి వదిలేశారని, పూర్తి నాణ్యత లోపించిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు పనులు చేపట్టలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించినా నాణ్యత లోపించిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి స్థాయి నాణ్యతగా నిర్మించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

సచివాలయ భవనంలోకి తహశీల్దార్ కార్యాలయం


కొబ్బరికాయ కొట్టి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ సూర్యప్రభ

ప్రత్తిపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం స్థానిక బస్టాండ్‌ఎదురుగా గల నూతనంగా నిర్మించిన సచివాలయ భవనంలోకి మారింది. నూతన కార్యాలయాన్ని శుక్రవారం తహశీల్దార్ ఎం.సూర్యప్రభ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కొత్త కార్యాలయం ద్వారా మండల ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పుణ్యవతి, మండల సర్వేయర్ బషీర్, ఆర్ఐ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌ను నూతన కార్యాలయంలో నిర్వహిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ధర్మవరానికి జాస్తి వసంత్ పాదయాత్ర

ప్రత్తిపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట టీడీపీ నాయకుడు జాస్తి వసంత్ బృందం పాదయాత్ర శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చేరుకుంది. టీడీపీ అధికారంలోకి రావాలని, జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ ఘన విజయం సాధించాలని అన్నవరం సత్యదేవునికి మొక్కు కోవడంతో అది నెరవడంతో గండేపల్లి మండలం మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, టీడీపీ కార్యకర్తలు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ధర్మవరం చేరుకుంది. టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, వెన్నా శివ, అంబటి రాంబాబు, యర్రాబత్తుల గోవిందనాయుడు, భూపాలపట్నం ప్రసాద్, పంచాది వీరబాబు స్వాగతం పలికి సంఘీభావం తెలిపి పాల్గొన్నారు.

'గంజాయి రవాణాపై నిఘా'

రౌతులపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాను అరికట్టామని, ఎక్కడికక్కడ నిఘా పెట్టి ఉక్కుపాదం మోపినట్టు ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు తెలిపారు. రౌతులపూడిలో ప్రభుత్వ కార్యాలయాలు సమీపంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణానికి తహశీల్దార్ ఎస్వీ నరేష్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. కొత్త అమవాస్య పండుగ నేపంతో ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్‌తో జల్లెడ'

జగ్గంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శుక్రవారం అనుమానిత ప్రాంతాలను డ్రోన్ సహాయంతో జల్లెడ పట్టినట్టు సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట పోలీస్‌స్టేషన్, నెహ్రూనగర్, డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాలు, జగనన్న కాలనీ ఏరియాలను డ్రోన్ సహాయంతో జల్లెడ పట్టారు. అసాంఘిక శక్తులు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినవారిపై డ్రోన్ సహాయంతో నిఘా ఏర్పాటు చేసి ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామన్నారు.

'మున్సిపల్ వాటర్‌ను పొదుపుగా వాడుకోవాలి'

తుని రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తుని శివారు పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో పట్టణంలోకి వాటర్ సరఫరా అయ్యే పైపులైన్లు మార్పు, చేర్పులు పనుల్లో భాగంగా రోజు కంటే తక్కువ వాటర్ సరఫరా అయ్యేందుకు అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి పది వార్డులు ప్రజలు మున్సిపల్ వాటర్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి సమస్యలకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు.

హిజ్రాల నిరసన

శంఖవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో హిజ్రా దీపును దారుణంగా హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ శుక్రవారం రాత్రి కత్తిపూడి 16వ నంబరు జాతీయ రహదారిపై పలువురు హిజ్రాలు నిరసన ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. నిందితులకు ఉరిశిక్ష వేయాలని నినదించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ప్రత్తిపాడులో కోర్టు వద్ద న్యాయవాదుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న న్యాయవాదులు

ప్రత్తిపాడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద పరిరక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐలాజ్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు కోర్టు వద్ద శుక్రవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్‌జస్టిస్ ఒక రోజు దేశ వ్యాప్త పిలుపు మేరకు న్యాయవాదులరక్షణ చట్టం కోసం స్థానిక న్యాయవాదులు నేషనల్ ప్రొటెస్ట్ డే నిర్వహించారు. ఐలాజ్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ కేసులు, మానవ హక్కుల కేసులు వాదిస్తున్న న్యాయవాదులపైన ఇటీవల దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ విద్రోహ శక్తుల నుంచి పోలీసుల నుంచి, ముఠాల నుంచి న్యాయవాదులపై మూకుమ్మడి దాడులు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ దాడులు నివారించడానికి కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో న్యాయవాద రక్షణ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, రాష్ట్ర కోశాధికారి అవసరాల దేవి, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి పలివెల నాగేంద్రరాజు, సీనియర్ న్యాయవాదులు బండారు నరసింహారావు, జోగా ప్రసాద్, జిగటాల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు

బీఎస్పీ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు


శంఖవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

శంఖవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో మాల మాదిగలను విభజించి పాలించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని బీఎస్పీ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు గునపర్తి అపురూప్ అన్నారు. వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం తీసుకున్న చర్యలకు నిరసనగా శుక్రవారం స్థానిక దళితవాడలో జైభీమ్ యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని, దళితులకు రిజర్వేషన్ ఫలాలు అందకుండా చేసే కుట్రే వర్గీకరణ అని అన్నారు. కార్యక్రమంలో కొంగు రమేష్, గునపర్తి కొండలరావు, బత్తిన తాతాజీ, శికోలు నాగు, పొలుమాటి శాంతి భరత్, బత్తిన శివరామ్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్



వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు, యానాం జిల్లాల స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంటు 2025 కార్యక్రమం ప్రారంభమైంది. ఉభయగోదావరి, యానాం జిల్లాల నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్శిటీని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎం పిక చేసిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ కేవలం కల కాదు ఇది ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతి, సామాజిక సమానత్వం, పర్యావరణ స్థిరత్వం కోసం ఒక సామూహిక లక్ష్యమన్నారు. వైస్ ఛాన్సలర్ ఎంబి శ్రీనివాస్, కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ కిషోర్ దూలం, జేఎన్‌టీయూకే కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఎన్‌శ్రీనిఎస్ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఈవిఎస్ శర్మ, డాక్టర్ తెలుగు నీలిమ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

ఏలేశ్వరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో నిరసన కొనసాగించారు. డ్రైవర్ ఎస్ వీ రమణపై అక్రమ సస్పెన్షన్ పెట్టి విధుల నుంచి తొలగించడం సరికాదని సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఎర్ర బ్యాడ్జీలు ధరిం చి భోజన విరామ సమయంలో ఎంప్లాయిస్ నిరసన తెలియజేశారు. ఏన్ఎమ్‌యూ కార్యదర్శి కె.త్రిమూర్తులు, ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి యు.బి.ఎమ్ కుమార్, ఎన్‌పిరావు మద్దతు తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత

తుని రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తుని మండలం సూరవరం గ్రామానికి చెందిన గణపర్తి కాంతమ్మ తీవ్ర అనారోగ్యంతో కాకినాడ హాస్పటల్ నందు చేరగా నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం నిమిత్తం శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ తుని జీఎన్ఆర్ గ్రూపు సభ్యులు రూ.90వేలు సమాకూర్చగా దానికి అదనంగా మన శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సహాయ నిధి నుంచి రూ.10వేలు కలిపి శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు బాధిత కుటుంబానికి అందజేశారు.

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

వీరవరంలో భారీ అన్నసమారాధన

కిర్లంపూడి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వీరవరం గ్రామంలో వనదుర్గమ్మ వారి 8వ వార్షికోత్సవం పురస్కరించుకుని భారీ అన్నసమారాధన శుక్రవారం నిర్వహించారు. జేజేలు గురువు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు సూర్యదత్త మోహన్ దత్త ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో కర్రి శ్రీను, వెలుగుల సూరిబాబు, చింత సత్యానందరావు, చింతల విజయ్‌కుమార్, దంటా సుబ్బారావు, అమ్మసాల యువరాజు, కర్రి సాయి, మర్ర సుబ్బారావు, మరోటి గోవిందు, దంతా సురేష్, జనపరెడ్డి శివ తదితరులు ఉన్నారు.

'నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి'

తొండంగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోగా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నర్సింహం క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో అన్ని ప్రయోజనాలు రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా అందుతాయన్నారు. ఆధార్‌తో పాటు రిజిస్ట్రేషన్ నెంబరు కూడా ముఖ్యమైనందున ఒనగూడే ప్రయోజనాలను వివరించాలన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం


ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

జగ్గంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాకలో టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట బాలా త్రిపుర సుందరిసమేత రామలింగేశ్వరరావు స్వామి దేవాలయం కమిటీ సభ్యులు అర్చకులు ఆలయ శేషవస్త్రంతో సత్కరించారు. నీలాద్రిరావుపేటలో శ్రీబాలా త్రిపురసుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి ధుపదీప నైవేద్యం పథకంలోకి ఈ ఆలయాన్ని చేర్చేందుకు విశేష కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లైన్ డాక్టర్ నక్క సత్యనారాయణ, మాజీ ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు బొడ్డు సత్తిరాజు, ఆలయ అర్చకులు చంద్రమౌళి, రాజీవ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తులకు ఆహ్వానం

శంఖవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.బాలమణి కుమారి పేర్కొన్నారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఉన్నాయని, నేటి నుంచి ఏప్రిల్ 11వరకూ మాత్రమే గడువు ఉందన్నారు. బడిబయట, వెనుకబడిన తరగతుల, ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారికి మాత్రమే ఈ అవకాశం అని తెలిపారు. కేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుచేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువకులకు కౌన్సిలింగ్

కోటనందూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నిర్లక్షంగా, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్న మైనర్ యువకులకు కోటనందూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ టి.రామకృష్ణ కౌన్సిలింగ్ నిర్వహించారు. కోటనందూరుకు చెందిన యువకులు నిత్యం కోటనందూరు బస్టాండ్ నుంచి నిత్యం మితిమీరిన వేగంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తుండడంతో ఎస్ఐ పట్టుకున్నారు. 15మంది యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మళ్లీ ఇలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగ్గంపేటలో అగ్నిప్రమాదం

జగ్గంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. మసీదు ఎదురుగా ఉన్న పాత కారం మిల్లు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి దాసరి రాంబాబుకు సంబంధించిన ఇంట్లో ఉన్న సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపుచేశారు. రూ.50వేలు ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

యనమల పరామర్శ

తొండంగి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఏవినగరం గ్రామానికి చెందిన పిర్ల వెంకటరావును టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, యనమల రామకృష్ణుడు శుక్రవారం పరామర్శించారు. కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావుకు అందుతున్న చికిత్స వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పిర్ల శివ పలువురున్నారు.

సినీ నటుడికి సన్మానం

కోటనందూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కోటనందూరుకు చెందిన సినీనటుడు మహర్షిరమణను విశాఖపట్నం ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సన్మానించారు. ఏయూ దూర విద్య, ఆన్లైన్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ విజయ్ మోహన్, ప్రొఫెసర్ సిద్దయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. రమణ సినిమాలు, సీరియల్స్‌లో నటిస్తున్నారు.ఎస్.శ్రీధర్, విద్యార్థులు ఉన్నారు.

